మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ధరల పెరుగుదలను అరికట్టడంలో

కూటమి ప్రభుత్వం విఫలం

- సిపిఎం నిరసన ప్రదర్శన, ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయలేని టిడిపి, బిజెపి కూటమి ప్రభుత్వ వైఖరిని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ విమర్శించారు. కర్నూలు సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన సోమవారం గడియారం హాస్పిటల్ నుంచి నిరసన ప్రదర్శన ప్రారంభించారు. పూల బజార్, వన్ టౌన్, నాలుగు రస్తాలు, చిన్న మార్కెట్ రోడ్డు, మీద పూల బజార్‌కు చేరుకొని అక్కడ ధర్నా నిర్వహించారు. గౌస్‌దేశాయి ధర్నానుద్దేశించి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వస్తే పెరిగిన ధరలను తగ్గిస్తామని మాట ఇచ్చి ,అధికారంలోకి వచ్చాక నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు పెంచేసి ప్రజలపై భారాలు మోపి వందరోజుల సంబరాలు జరుపుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజలకు భారంగా ఉండే అన్ని రకాల బారాలను తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీని మరచి నిత్యవసర వస్తువుల ధరలను పేద, మధ్య తరగతికి అందకుండా ఆకాశానికి ఎగబాకే విధంగా బిజెపి టిడిపి పోటీపడి పెంచుతున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను (సూపర్ సిక్స్)అమలు చేయకపోగా తిరిగి ప్రజల పైన భారాలు వేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కొన్ని కోట్ల ప్రజల మనోభావాలతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెలగాటమాడుతున్నారని నిప్పులు చేరిగారు. ప్రజల మధ్య వైశాల్యాలు పెంచి శాంతియుత వాతావరణాన్ని చెడగొట్టే ప్రసంగాలు చేస్తున్నారన్నారు. రోజురోజుకు పెంచుతున్న నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని, లేకపోతే ప్రజా ఉద్యమాలు తీసుకొచ్చి బిజెపి, టిడిపి, జనసేన పార్టీలను ముద్దాయిలుగా నిలబెడతామని హెచ్చరించారు. సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, సీనియర్ నాయకులు కె.రాజగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు సనాతన ధర్మంపై బాబాలు స్వామీజీలు మాట్లాడినట్టు ఉపన్యాసాలు చేస్తున్నారని, ఇది అధికారపక్షంలో ఉన్న మీకు తగదని హితవు పలికారు. ప్రజలకు రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తు రాజ్యాంగం కల్పించిన రాజకీయ పదవులలో ఉన్న వీరు ఆ పదవిలో ఉండటానికి అర్హత లేదని తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటి సభ్యులు ఎం.విజయ రామాంజనేయులు, వై నగేష్ , నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్, డి అబ్దుల్ దేశాయ్, కె.రామకృష్ణ, నగర కమిటీ సభ్యులు ఎస్‌డి ఖాజాపాష, లాల్‌బాష, మొహమ్మద్ రఫీ, రాంబాబు మద్దిలేటి, షేక్షావలి పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

రైతులకు రస్తా సౌకర్యం కల్పించండి

- ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలం నూతనపల్లె గ్రామం పసుపల రైతులు తాండ్రపాడు నుండి గార్గేయపురం వరకు (340శాతం) హైవే రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులకు రాస్తా సౌకర్యం వెంటనే కల్పించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బాధితుల రైతులతో ధర్నా నిర్వహించారు. నూతనపల్లె గ్రామ సర్పంచి బాలస్వామి అధ్యక్షతన జరిగిన ధర్నాలో జి.రామకృష్ణ మాట్లాడుతూ రైతుల భూములు తీసుకొని తక్కువ నష్టపరిహారం ఇవ్వడమే కాకుండా మిగిలిన భూములకు పోవడానికి రస్తా లేకుండా చేయడం చాలా దుర్మార్గమన్నారు. నేషనల్ హైవే రోడ్డు దాటిన తర్వాత నూతనపల్లె, పశుపల గ్రామాల రైతుల భూములు సుమారుగా 900 ఎకరాలకు పైగా ఉన్నాయన్నారు. వాటిని సాగు చేయాలంటే వంతెన కింద రాస్తా ఏర్పాటు చేయడం అవసరమన్నారు. దానికి కొద్ది దూరం సర్వీసు రోడ్డును కూడా నిర్మాణం చేయాలన్నారు. నేషనల్ హైవే అధికారులు లేదా కాంట్రాక్టర్లు ఇక్కడ రాస్తా లేదని చెప్పడం చాలా అన్యాయం ఇక్కడ రాస్తా సౌకర్యం కల్పించకపోతే సుమారు పది కిలోమీటర్లు ఉంటే గార్గేయపురం దగ్గర తిరిగి రావాల్సి వస్తుందన్నారు. దీనివల్ల రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. భూసేకరణ సందర్భంగా రాస్తా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు లేదని చెప్పడం చాలా అన్యాయమన్నారు. హైవే రోడ్డు పక్కన దాటిన తర్వాత ఎర్ర మట్టి నేల భూములు చాలా సారవంతంగా ఉండి బోర్లు బావులు కలిగి ఉన్నాయన్నారు. అటువంటి భూములు సాగు చేయడానికి వీలుగా ప్రభుత్వం జిల్లా అధికారులు వెంటనే స్పందించి రస్తాసౌకర్యం కల్పించలన్నారు. అనంతరం రైతులందరూ జిల్లా కలెక్టర్ రంజిత్ భాషను కలిసి వినతి పత్రం ఇచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే గ్రామానికి వెళ్లి పరిశీలన చేసి అక్కడున్న పరిస్థితులను రిపోర్ట్ ఇవ్వాలని డిఆర్‌ఒ చిరంజీవిని ఆదేశించారు. శేఖర్, వెంకట్‌రాముడు, రమణ శ్రీనివాసులు, కృష్ణ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వికలాంగుల వద్దకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి

మానవత్వం చాటుకున్న ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ సోమవారం విభిన్న ప్రతిభావంతుల పట్ల తన మానవత్వాన్ని చాటుకున్నారు. నేరుగా వికలాంగుల వద్దకు వెళ్లి మోకాళ్లపై కూర్చుని వారి సమస్యలను విన్నారు. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. కర్నూలు ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో మాట్లాడారు. కొంతమంది వికలాంగులు ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చారని తెలిసి ఆయన వినతల స్వీకరించే గది నుంచి బయటకు వచ్చి నేరుగా ఆయనే వారి ముందు మోకాళ్ళపై కూర్చొని వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని సమస్యలకు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఈఘటన అక్కడికి వచ్చిన ఫిర్యాదుదారుల మనసును కదిలించింది. స్థానిక ఫిర్యాదుదారులు ఎస్‌పి స్పందనను ప్రశంసించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్‌పి హామీ ఇచ్చారు. మొత్తం 132 ఫిర్యాదులు వచ్చాయి. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి , లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐ శివశంకర్ పాల్గొన్నారు.

వికలాంగుని వద్దకెళ్లి వినతి స్వీకరిస్తున్న ఎస్‌పి

తహశీల్దార్లు స్పందించడం లేదు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో కర్నూలు అర్బన్, ఆదోని రూరల్, దేవనకొండ, గోనెగండ్ల, కల్లూరు మండలాల్లో అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని తహశీల్దార్లు ఎందుకు స్పందించడం లేదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష మండిపడ్డారు. ఇప్పటికైనా ఫిర్యాదుల పరిష్కారానికి దృష్టి సారించాలని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ ఓపెన్ కాకుండా చూసుకోవాలని కోరారు. పిజిఆర్ఎస్‌కు సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై సిఎంఒ కార్యాలయం నుంచి విశ్లేషణ జరుగుతోందన్నా రు. ఏ శాఖలో ఎక్కువ శాతం ఫిర్యాదులు వస్తున్నాయన్నాయని ఆరా తీశారు. ఏ శాఖలో ఎక్కువ రీఓపెన్ అవుతున్నాయని లోతుగా విశ్లేషణ జరుగుతున్నందున అధికారులు ఫిర్యాదుల పరిష్కారంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జెసి డాక్టర్ బి.నవ్య, డిఆర్‌ఒ చిరంజీవి, అధికారులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సమగ్ర శిక్ష జెఎసి నేతలు సోమవారం జిల్లా కలెక్టర్ పిరంజిత్ బాషను ఆ సంఘం ఉద్యోగుల జెఎసి నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. జెఎసి గౌరవ అధ్యక్షులు జె.నాగేశ్వరరావు, రాష్ట్ర జెఎసి కో -చైర్మన్ మహమ్మద్ రఫి, జిల్లా జెఎసి అధ్యక్షులు రాజు, జెఎసి జిల్లా నాయకులు, మధు మోహన్, సుబ్బరాయుడు, రవి, సుభాన్, శంషుద్దీన్, రవీంద్ర నాయక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఆగస్టు , సెప్టెంబర్ నెల వేతనాలు చెల్లించాలన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫైలు పెట్టి బడ్జెట్ తెప్పిస్తామని హామీ ఇచ్చారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి

- బొప్పరాజు వెంకటేశ్వర్లు, చైర్మన్ ఎపిజెఎసి అమరావతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులకు సంబంధించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన జిపిఎఫ్ వెంటనే ఇవ్వాలని కోరారు. సోమవారం కలెక్టరేట్లోని రెవెన్యూ పొదుపు భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సరెండర్ లీవ్ బిల్లులు అనేక సంవత్సరాలుగా సిఎఫ్ఎంఎస్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కనీసం పోలీసు ఉద్యోగులకు అయినాసరే సరెండర్ లీవులైన దసరా పండుగకు చెల్లించలన్నారు. ఉద్యోగులు వారి కుటుంబం తక్షణ అవసరాల కోసం దాచుకున్న జిపిఎఫ్, జడ్‌పిపిఎఫ్ డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతం, పెన్షన్ ను చెల్లిస్తూ ఉద్యోగుల గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని కపాడుతున్నందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అమరావతి జెఎసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర కోశాధికారి , పంచాయతీ రాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనపర్తి సంగీతరావు, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిసెట్టి వెంకట రాజేష్, క్లాస్ 4 ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు, ఎఎన్ఎం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.సులోచనమ్మ, గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, జిల్లా ఎపిజెఎసి అమరావతి చైర్మన్ వి.గిరి కుమార్ రెడ్డి, నంద్యాల జిల్లా చైర్మన్ పి.రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ విజేతలు నెల్లూరు, అన్నమయ్య

ప్రజాశక్తి-సి బెళగల్

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆది, సోమవారాలలో సిబెళగల్‌లోని బాలయోగి గురుకుల స్టేడియంలో నిర్వహించారు. ఇందులో 12 జిల్లాల నుండి బాలికల జట్లు, 16 బాలుర జట్లు 18 వరకు పాల్గొన్నాయి. సోమవారంతో క్రీడలు పూర్తి కాగా బాలికల జట్టు అన్నమయ్య జిల్లా పై నెల్లూరు జిల్లా జట్టు గెలుపొందింది. పల్నాడు పై అన్నమయ్య జిల్లా బాలుర జట్టు విజయం సాధించింది. విజేతలకు మండల నాయకులు మాజీ జడ్‌పిటిసి చంద్రశేఖర్, వలి, ధనుంజయ తదితరుల చేతుల మీదుగా బహుమతులను మేమేంటోలను పిజికల్ డైరెక్టర్ రాఘువేంద్ర, ప్రభాకర్, విజేతలకు అందజేశారు.

ఆర్‌యు రిజిస్ట్రార్ రాజీనామా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ ఇన్చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ పి.వెంకటేశ్వర్లు సోమవారం ఆ పదవికి రాజీనామా చేస్తూ వర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు , రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి లేఖను పంపారు. ఇటీవల గత రెండు రోజుల క్రితం బిఇడి కళాశాల యాజమాన్యాలు ఆయనపై వ్యవహరించిన తీరును తట్టుకోలేక రిజిస్ట్రార్ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా పట్ల ప్రస్తుతం వర్సిటీలో చర్చ కొనసాగుతుంది.

ఇన్‌ఛార్జి డిఇఒగా శ్రీనివాసులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జిల్లా విద్యాశాఖ అధికారి కె. శామ్యూల్ ఈనెల 13 వరకు వ్యక్తిగత సెలవు పెట్టి వెళ్లారు. అప్పటివరకు పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులకు ఇంచార్జ్ డిఇఒగా బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

మద్దికేర డిటిగా శ్రీదేవి

ప్రజాశక్తి-మద్దికేర

పత్తికొండ తహశీల్దార్ ఆఫీస్ నుండి మద్దికేరకు డిప్యూటీ తహశీల్దార్‌గా బదిలీ అయినట్లు శ్రీదేవి తెలిపారు. మండల కేంద్రమైన మద్దికేరలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ విధులను, మండల ప్రజలకు, కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామన్నారు. ప్రజలకు, రైతులకు, నాయకులకు, అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలందిస్తానని ప్రజలందరూ, సహకరించాలన్నారు.

స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్ రూపకల్పన

ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఐదేళ్ల అభివృద్ధి లక్ష్యాలతో స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్ రూపకల్పన చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు శాఖ మంత్రి టిజి.భరత్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర 2047 జిల్లా దార్శనిక ప్రణాళిక (2024-29) రూపకల్పనపై ప్రజాప్రతినిధులతో మంత్రి టిజి. భరత్ సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలతో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రణాళికలను రూపొందించనున్నామన్నారు. జిల్లాలో ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్ గ్రోత్ ఇంజన్‌అని, దీనివల్ల జిల్లాలో గణనీయమైన అభివృద్ధి సాధించనున్నామని మంత్రి తెలిపారు. దాదాపుగా రూ.2800 కోట్లతో ఓర్వకల్లు నోడ్ అభివృద్ధి కానుందని తెలిపారు. షార్ట్, మీడియం, లాంగ్ టర్మ్ లక్ష్యాలతో ప్రణాళికను రూపొందించుకుని అమలు చేయనున్నామన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ . పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.110 కోట్లతో రోడ్లను నిర్మించ బోతున్నామని తెలిపారు. వీటిని మార్చి 2025 నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఆయా శాఖల అధికారులు ఐదేళ్ల ప్రణాళికలో పొందుపరచే అంశాల గురించి వివరించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ఓర్వకల్లులో నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గుండ్రేవుల రిజర్వాయర్‌ను నిర్మాణం చేయాలన్నారు. ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో అన్ని చెరువులను కూడా నింపాలని సూచించారు. కర్నూలు నుండి వైజాగ్ వరకు వయా గుంటూరు, విజయవాడ మీదుగా ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఏర్పాటుకు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓర్వకల్లు ఎయిర్ పోర్ట్ నుండి విజయవాడ కు విమానం, నైట్‌ల్యాండింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆదోని ఎమ్మెల్యేడాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ ఆదోనిలో వలసల నివారణకు కస్తూర్బా, జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని, వసతి గృహాల్లో ఉన్న విద్యార్థినులకు ఐరన్‌ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్, శానిటరీ నాక్‌పిన్స్‌అందజేసేలా చూడాలన్నారు. జిల్లాఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

ఆదిత్య నగర్ కాలనీలో కాలువలు నిర్మించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 27వ వార్డులో ఆదిత్యనగర్‌కాలనీలో కాలువలు నిర్మించాలని సోమవారం అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. వినతి ఇచ్చినవారిలో ఆదిత్యా నగర్ కాలనీ అసోషియన్ కార్యదర్శి బిఎల్ఎన్ ప్రసాద్ శర్మ, వి.భాస్కర్ రెడ్డి, సిహెచ్. సాయిబాబా, ఎస్.అక్బర్ బాష కాలనీ వాసులు ఉన్నారు. గతంలో అనేక సార్లు మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఇంతవరకు సమస్యకు పరిష్కారం చేయలేదని, మీరైనా ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. వర్షం కురిసిన ప్రతీ సారి రోడ్డు పైన ప్రవహించే నీళ్లలో తిరుగలేని పరిస్థితి ఏర్పడుతుందని, నేషనల్ హైవే సర్విసు రోడ్డు పైన ఉన్న కల్వర్టు ఎత్తు లేక పోవడం వలన, ఆదిత్యానగర్ కాలనీ కాలువలు ఎప్పుడో పంచాయతీ కాలంలో వేసినవి కావడం వల్ల వర్షం కురిసిన ప్రతీ సారి రోడ్డు పైన ప్రవహించే నీళ్లతో కాలనీ ప్రజలు ఇళ్లనుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రోజూ వేలాది మంది టూవీలర్, కార్లు,ట్రాక్టర్లు భారీ వాహనాలు నిరంతరం ప్రయాణిస్తూ ఎప్పుడూ రద్దీ గా ఉంటుందన్నారు. అదనపు కమిషనర్ స్పందించి అక్కడనే ఉన్న ఎఇకి సమస్యను వెళ్లి పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ఎఇ రెండు రోజులలో వచ్చి పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అసమానతల్లో పార్కుల అభివృద్ధి : పిపిఎస్ఎస్

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

కొన్ని ప్రాంతాల్లోని పార్కులకు రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేస్తూ.. కొన్ని ప్రాంతాల్లోని పార్కుల అభివృద్ధిపై వివక్షత చూపుతున్నారు. గత ప్రభుత్వంలో అధికార పార్టీ అనుచరుడు ఒక కాంట్రాక్టర్ వీకర్ సెక్షన్ సమీపంలోని స్వాతంత్ర సమరయోధులు సుందరయ్య పార్కు గోడను కూలగొట్టి డంపు యార్డుగా మార్చుకొని ఏళ్లు గడుస్తున్నా ఇంజనీర్లు స్పందించలేదని అడిషనల్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ దృష్టికి తెచ్చారు. అధికారం కోల్పోయిన ఆ కాంట్రాక్టర్‌కు ఇంజనీర్లు ఎందుకు భయపడుతున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం.నాగరాజు ప్రశ్నించారు. సోమవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు తమ ప్రాంతంలోని పార్కులను అభివృద్ధి చేయాలని అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 50 ఏళ్ల క్రితం మున్సిపాలిటీకి స్వాధీనం చేసిన ఎల్ఐసి పార్కులో పిచ్చి మొక్కలు పెరిగి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారిందన్నారు. శివారు ప్రాంతాల్లో ఐదు కాలనీలకు ఉపయోగపడే పార్థసారథి నగర్ పార్కు దాదాపు ఎకరావిస్తీర్ణంలో ఉందన్నారు. స్థానికులు శ్రమదానం చేసి కంప చెట్లను తొలగించుకున్నారని, అడిషనల్ కమిషనర్ దృష్టికి తెచ్చారు. సంతోష్‌నగర్ లో సొంత ఖర్చులతో పార్కు అభివృద్ధి చేసుకున్నామని, వ్యాయాయం, నడకదారి ఏర్పాటు చేయాలని కోరారు. వెంకటరమణ కాలనీ రోడ్డు ఫుట్పాత్ పైనా.. మురుగు కాలువలో కాంట్రాక్టర్ మట్టి వేసినందు వల్ల వర్షం నీరు రోడ్డుపై కొచ్చి ప్రజలకు అసౌకర్యంగా మారిందన్నారు. కాంట్రాక్టర్ పై చర్య తీసుకొని మట్టిని తొలగించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో సివి. వర్మ, కె. శ్రీనివాసులు, టి.మద్దిలేటి, బి.రాజు, జి. గోపీనాథ్, ఎన్. పీటర్, జి. నాగేంద్ర తదితరులు ఉన్నారు.

అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జాతీయస్థాయి పోటీలకు లక్ష్య క్రీడాకారిణి రేణుక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఫర్ మెన్ డిగ్రీ కాలేజీలో ఉన్న లక్ష్య ఫుట్‌బాల్ సెంటర్ క్రీడాకారిణి రేణుక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫర్ మెన్ కాలేజీలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న రేణుక గత నెల రాష్ట్రస్థాయిలో చక్కటి ప్రతిభను కనపరిచి జాతీయస్థాయి సీనియర్ ఉమెన్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై ఈనెల 9న ఢిల్లీ నోయిడాలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బయలుదేరనున్నది. ఈ మేరకు కళాశాలలో జరిగిన సభలో ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి మాట్లాడుతూ లక్ష్య ఫుట్‌బాల్ సెంటర్ ఫౌండర్ పుల్లెల గోపీచంద్, కోచ్ నాగపూర్ రమేష్ సేవలను కొనియాడారు. రేణుక జాతీయస్థాయిలో కూడా చక్కటి ప్రతిపను కనపరిచి రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు.

బిఎస్‌పిఎల్ వినియోగదారుల అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :

కర్నూలు పోస్టల్ డివిజన్ పరిధిలోనీ బిఎన్‌పిఎల్ వినియోగ దారులకు జాతీయ తపాలవారోత్సవాల్లో భాగంగా సోమవారం పోస్టల్ సూపరింటెండెంట్ జనార్ధనరెడ్డి ఆ ధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. తపాలా శాఖ వారు అందిస్తున్న స్పీడ్ పోస్ట్ సర్వీస్‌ల గురించి , డాక్ ఘర్ నిర్యత్ కేంద్రం కర్నూలు లోని హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల వారు తమ వ్యాపార ఉత్పత్తులను విదేశాలకు సులువుగా పంపవచ్చని తెలిపారు.పోలీసు శాఖ, ఇన్‌కంటాక్స్, ఎల్ఐసి, అల్‌ఇండియా రేడియో , ఐడిబిఐ బ్యాంక్ వంటి సంస్థల నుంచి పాల్గొన్నారు. పోస్టల్ సూప రింటెండెంట్ జనార్ధన్ రెడ్డి , అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్లు రహిమాన్ , నూరల్ల,మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గరిబ్‌బాష పాల్గొన్నారు.



సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ

ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండల కేంద్రం 28వ వార్డ్ లక్ష్మీపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీ పై పప్పు శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని పాణ్యంఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జెడి వరలక్ష్మి, ఎడిఎ శాలి రెడ్డి, ఎఒ శ్రీనివాసరెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ అకేపోగు వెంకట స్వామి, గ్రామ నాయకులు మాజీ సర్పంచి పుల్లారెడ్డి, రామిరెడ్డి, రాధకృష్ణరెడ్డి, శివ, మురళి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి మొక్కల తో నిరసన తెలుపుతున్న రైతు

నాసిరకం విత్తనాలతో నిండా మునిగాం

- పత్తి మొక్కలతో రైతు నిరసన

ప్రజాశక్తి - ఆదోని

నాసిరకం పత్తి విత్తనాలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వమే న్యాయం చేయాలని రైతు చిన్న ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు పత్తి మొక్కలతో నిరసన చేపట్టారు. అంతకుముందు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు చిన్న మాట్లాడారు. ఆదోని మండలం పెద్దతుంబలం గ్రామంలో మూడెకరాల పొలంలో పత్తి పంట సాగు చేశామని తెలిపారు. పట్టణంలోని భువనేశ్వరి సీడ్స్ దుకాణంలో మూడు నెలల క్రితం కావేరి కంపెనీకి చెందిన తెనాలి పత్తి విత్తనాలను కొనుగోలు చేసి పొలంలో నాటామన్నారు. పంట ఏపుగా పెరిగిందని తెలిపారు. ఇదే విషయాన్ని సీడ్ దుకాణదారులకు అప్పట్లోనే తెలిపామన్నారు. కాయ వస్తుందని నమ్మిస్తూ వచ్చారని తెలిపారు. పూత, కాయ రాకపోవడంతో తాను నష్టపోయానని గ్రహించానని అన్నారు. విత్తనాలు, మందుల కోసం సుమారు రూ.1.5 లక్షలు పెట్టుబడి పెట్టామన్నారు. సుమారు రూ.3 లక్షల దిగుబడి వస్తుందని ఆశించామని తెలిపారు. ఏడాది పాటు కష్టపడి ఇలా నాసిరకం విత్తనాలు నాటి తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని దుకాణదారులను అడిగితే సరైన సమాధానం చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారని, పంటను పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు.

విఆర్‌ఒల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చిప్పగిరి

తహశీల్దార్‌కు జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న విఆర్‌ఒలు

మండలంలోని పలు గ్రామాలకు బదిలీపై వచ్చిన విఆర్‌ఒలు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్‌కు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. నేమకల్లు విఆర్‌ఒగా వన్నూరు స్వామి, నగరడోన విఆర్‌ఒగా రంగన్న, దౌల్తాపురం విఆర్‌ఒగా పెద్దన్న చిప్పగిరి విఆర్‌ఒగా గోవిందప్ప, బెల్డోన విఆర్‌ఒగా చందు నాయక్, డేగలపాడు విఆర్‌ఒగా అంజి జాయినింగ్ రిపోర్ట్ అందజేసినట్లు తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ... విధుల్లో అలసత్వం వహించకుండా రైతులకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని వారికి సూచించారు. ఉపాధి హామీ మండల ఎపిఒగా జాబర్ అహ్మద్ మండల కార్యాలయంలో ఎంపిడిఒ అల్లా బకాష్ ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టారు.

శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి- దేవనకొండ

రబీ సీజన్‌లో నల్లరేగడి పొలాల్లో శనగ విత్తనాలు వేసుకునే రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. సోమవారం దేవనకొండలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎఒ సురేష్ బాబు ఆధ్వర్యంలో శనగ విత్తనాలను, టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. త్వరలో ప్రభుత్వం వ్యవసాయ పరికరాలను రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. 100 కిలోల అసలు ధర రూ.9,400 ఉండగా రాయితీ పోను రైతు రూ.7,050 చెల్లించాలన్నారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రాఘవేంద్ర, పత్తికొండ ఎడిఎ విజయమోహన్, బిజెపి ఆలూరు ఇన్‌ఛార్జీ వెంకటరాముడు, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు బడి గింజల రంగన్న, ఆకుల వీరేష్, మాలిక్, ఈదుల దేవరబండ సుభాన్, కప్పట్రాళ్ల మల్లికార్జున, వెంకటస్వామి గౌడ్, మల్లికార్జున గౌడ్, రాజాసాబ్, వెలమకూరు సర్పంచి భాస్కర్, వ్యవసాయ శాఖ సిబ్బంది రంగన్న, మల్లికార్జున, జయరాం పాల్గొన్నారు.


శనగలను పంపిణీ చేస్తున్న వీరభద్ర గౌడ్

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే బీవీ ప్రజాదర్బార్

- బారులు తీరిన అర్జీదారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి 'ప్రజాదర్బార్' నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బీవీ వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సోమవారం 'ప్రజాదర్బార్' నిర్వహించారు. కార్యక్రమానికి ఊహించని రీతిలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. భూ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, హౌసింగ్, సిసి రోడ్ల ఏర్పాటు లాంటి సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించుకునేందుకు అర్జీదారులు భారీ సంఖ్యలో బారులు తీరారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఎమ్మెల్యే ఓపికతో వారందరి నుంచి 600లకు పైగా అర్జీలను స్వీకరించారు. శాఖల వారీగా వాటిని విభజించి సంబంధిత సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు సుపరిపాలన అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యమని తెలిపారు. సుపరిపాలనతో పాటు సమస్యలపై ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అందులో భాగంగా ప్రజలు సమస్యలపై వినతి పత్రాలు రాసుకుని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సిఐ గంగాధర్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. సర్పంచి హైమావతి, టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, ఎన్‌వి.రామాంజనేయులు, బేతాళ బడేసా, తిరుపతయ్య నాయుడు, ఎస్.షేక్షావలీ, గౌవుండా రహంతుల్లా, మదీనా, నూర్ అహ్మద్, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజల వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

పేదలకు అండగా ప్రభుత్వం

రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం పేదలకు అండగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. నందవరం గ్రామం బోయ రామకృష్ణ కుమారుడు బోయ రవితేజ తలలో ఇన్‌ఫెక్షన్ వల్ల అనారోగ్యానికి గురయ్యారు. రవితేజ హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స చేయించారు. ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల రవితేజ తల్లిదండ్రులు ఎమ్మెల్యే ద్వారా సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం స్పందించి రవికి రూ.2 లక్షలను సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు చేసింది. రూ.2 లక్షల ఎల్‌ఒసి పత్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి సోమవారం బాధిత కుటుంబానికి అందించారు. అలాగే నందవరం మండలం ముగతి గ్రామవాసికి వైద్య ఖర్చుల కోసం రూ.3.50 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఒసి పత్రాన్ని బాధిత కుటుంబాలకు అందించారు. సహాయాన్ని అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే బీవీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ధర్మపురం గోపాల్, నందవరం చాకలి మల్లికార్జున పాల్గొన్నారు.

మంజూరు పత్రాలను అందజేస్తున్న బీవీ

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

బిజెపి నాయకుల ప్రోద్బలంతోనే దాడి : బాధితులు

ప్రజాశక్తి - ఆదోని

బిజెపి నాయకుల ప్రోద్బలంతోనే దాడి చేసి గాయపరిచారని బాధితులు తెలిపారు. గాయాల పాలైన బాధితులు ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామంలో స్థలం విషయంలో ఇరువురి మధ్య ఆదివారం ఘర్షణ జరిగిందని బాధితులు తెలిపారు. గాయాలకు గురైన ఈరమ్మ, ఈరన్న, అమ్రేష్, పెద్ద బసవ సోమవారం మాట్లాడారు. స్థలం తగాద ఉందని మాట్లాడుకునేందుకు పెద్దవారు ఎవరూ లేరని, వచ్చిన తర్వాత మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకుందామని చెబుతున్నా పట్టించుకోకుండా కర్రలతో దాడి చేశారని తెలిపారు. బిజెపి నాయకులు భీమేష్, మహేష్ ప్రోద్బలంతోనే యువకులను ప్రోత్సహించి కర్రలతో దాడి చేయించారని వాపోయారు. ఈ సమస్య ముందుగా అధికారులకు తెలిసినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. స్థలం వివాదం పరిష్కరించాలని పలుమార్లు మండలాధికారులను కోరామని తెలిపారు. ఏ ఒక్కరూ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన ధనుంజయ, మంగన్న, దేవేంద్ర, మంజుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు వెళ్లాలని డాక్టర్లు సూచిస్తున్నారని, అంతా ఆర్థిక స్తోమత లేక ఇక్కడే ఉన్నామని వాపోయారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

విద్యుదాఘాతంతో పత్తి దగ్ధం

- రూ.లక్ష నష్టం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం గ్రామంలో విద్యుదాఘాతంతో పత్తి దగ్ధమై సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు ఏసేపు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఏసేపు ఇంటి మిద్దెపై ఉన్న 10 క్వింటాళ్ల పత్తి విద్యుదాఘాతంతో దగ్ధమైంది. పొలం నుంచి పత్తిని విడిపించి ఇంటికి తరలించి భద్ర పరిచారు. పత్తిని మార్కెట్‌కు తరలించాలనుకునేలోపు ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. ఇది విద్యుదాఘాతమా, లేక ఎవరైన తగలబెట్టారా అనే కోణంలో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ అనుమానితులతో వాగ్వాదానికి దిగారు.

దగ్ధమయిన పత్తి

అధికారుల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నందవరం

వివిధ శాఖల్లో అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ సెక్రటరీగా విజయలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తాను ఆదోనిలో పని చేసినట్లు, సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. సచివాలయ సెక్రటరీగా గోవర్ధనమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ... అందుబాటులో ఉంటూ సచివాలయాలకు వచ్చిన ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సేవలందిస్తామని తెలిపారు. వెలుగు ఎపిఎంగా రాఘవేంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... తాను ఆస్పరి మండలంలో ఎపిఎంగా పని చేసినట్లు తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా నందవరం గ్రామానికి వచ్చినట్లు చెప్పారు. మహిళలకు వివిధ సహకార సంఘాల ద్వారా రుణాలు, ప్రభుత్వం అందించే సబ్సిడీలను అందించి మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

వ్యవసాయానికి పగటిపూట

విద్యుత్ సరఫరా చేయాలి

- సబ్ స్టేషన్ ముందు రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కౌతాళం

వ్యవసాయానికి రైతులకు పగటిపూట విద్యుత్ సరఫరా చేయాలని కామవరం సబ్ స్టేషన్ ముందు రైతులు ఆందోళన చేపట్టారు. సోమవారం ఉరుకుంద, ఓబులాపురం, తిమ్మాపురం గ్రామ రైతులు మాట్లాడుతూ... విద్యుత్ శాఖ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో 10 నుంచి 12 గంటల వరకు, తెల్లవారుజామున 3 గంటల నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు వ్యవసాయ రంగానికి పగటి పూటే విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తమ పంటలకు వ్యవసాయ విద్యుత్ బోర్ల నుంచి నీటిని సరఫరా చేసుకోవడానికి రాత్రి సమయంలో ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నామని తెలిపారు. గతంలో వ్యవసాయానికి నిరంతరంగా పగటి పూటే విద్యుత్ సరఫరా అయ్యేదని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ శాఖ అధికారులు రాత్రి సమయంలో సరఫరా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతులకు నిరంతరంగా పగటిపూట సరఫరా చేయాలని కోరారు. రైతులు రవి, విజయ్ కుమార్, హుస్సేని, జయప్ప, సునీల్, అయ్యప్పలు లైన్‌మేన్‌కు వినతిపత్రం అందజేశారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మురుగుదొడ్డిని చూసి చలించిన కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీలో ఉన్న కమ్యూనిటీ టాయిలెట్ శిథిలావస్థకు చేరిందని, మరమ్మతులు చేపట్టాలని వార్డు కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ కోరారు. స్పందించిన కమిషనర్ కృష్ణ సోమవారం మురుగుదొడ్డిని పరిశీలించారు. భవనం పైకప్పు పెచ్చులూడి ఉండడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. మురుగుదొడ్డికి మరమ్మతులు చేపట్టాలని, నీటి వసతి, తలుపులు ఏర్పాటు చేయాలని ఉద్యోగులకు సూచించారు. వార్డులోని చౌదరిబావి, నిజాముద్దీన్ కాలనీ ప్రాంతాల్లో డ్రెయినేజీని ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ కమిషనర్‌ను కోరారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఆదోనిలో ముస్లింల భారీ ర్యాలీ

ప్రజాశక్తి - ఆదోని

మహ్మద్ ప్రవక్త పట్ల యాతి నరసింహ నంద స్వామితోపాటు మరికొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. సోమవారం పట్టణంలోని పెద్ద (షాహి జామియా) మసీదు నుంచి వందలాది ముస్లిం, మైనారిటీలు తరలివచ్చి పురవీధుల గుండా నిరసన ర్యాలీని కొనసాగించారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఒక్కసారిగా భారీ సంఖ్యలో యువకులు తరలిరావడంతో ర్యాలీలో నినాదాలతో హోరెత్తించారు. భీమాస్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టి భారీ ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయం చేరుకుని ధర్నా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యాతి నరసింహానంద స్వామితోపాటు మరి కొంతమందిని కఠినంగా శిక్షించాలని కోరారు. భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ముస్లింల మనోభావాలతో చెలగాటమాడడం, రెచ్చగొట్టడం తగదన్నారు. ఇప్పటికైనా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఆదోని ముస్లిం యూత్ కమిటీ సభ్యులు, ఆదోని ఖతిబ్ సాబ్ జునైద్ హాష్మి, ఖాజీ సాబ్, అల్తాఫ్ హుస్సేన్, తాహెర్ బాష, జామియా మసీదు ట్రస్ట్ సౌదీ రావుఫ్, ఉమ్మీ సలీం, ఫయాజ్, యూసుఫ్ ఉన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేనేతలకు గుర్తింపు కార్డు మంజూరు చేయాలి

- చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లేష్

ప్రజాశక్తి - నందవరం

చేనేతలకు గుర్తింపు కార్డు మంజూరు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లేష్ కోరారు. సోమవారం మండల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగలదిన్నె గ్రామంలో చేనేత కార్డు లేని వారు 100 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందాలంటే చేనేతలకు గుర్తింపు కార్డులు అనివార్యమని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నాగలదిన్నె గ్రామంలో నివసించే 100 కుటుంబాలకు అందడం లేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకంలో చేనేత కార్డు ఉన్న కొన్ని కుటుంబాలు మాత్రమే లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. నాగలిదిన్నె గ్రామాన్ని సందర్శించి చేనేత కుటుంబాలను విచారణ చేపట్టి కార్డు లేని వారికి కార్డు మంజూరు చేయాలని కోరారు. జిల్లా చేనేత అధికారి ఎడి స్పందించి చేనేతలకు గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని తెలిపారు.

మహా ఛండీదేవి అలంకారంలో వాసవీమాత

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో వైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవీమాత ఛండీదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవి కల్యాణ మండపంలో అమ్మవారికి పురోహితులు గతమాచార్ నేతృత్వంలో 5వ రోజు వేద మంత్రాలతో హోమాలు నిర్వహించారు. కుంకుమార్చన, నైవేద్య సమర్పణతో విశేష పూజలు నిర్వహించి, మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఒకే యాప్ ద్వారా పనులు చేయించాలి

- సిడిపిఒకు సిఐటియు వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీలకు ఒకే యాప్ ద్వారా పనులు చేయించాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, పట్టణ కమిటీ కార్యదర్శి ఎస్.నాగలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో సిడిపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, పిల్లలకు నాలుగు యాప్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే స్కీంలో అప్‌లోడ్ చేసే పరిస్థితి ఉందని, వాటిని ఒకే యాప్ ద్వారా అప్‌లోడ్ చేసేటట్టు ఉంచాలని కోరారు. అంగన్వాడీలకు సంబంధించిన రికార్డులను ప్రభుత్వమే సరఫరా చేయాలని తెలిపారు. అలాగే అంగన్వాడీలు 42 రోజుల పాటు సమ్మె చేశారని, జీతాలు పెంచడానికి ప్రభుత్వం ఒప్పుకుందని, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, కూటమి నాయకులు సమ్మెకు మద్దతుగా నిలిచారని తెలిపారు. అంగన్వాడీలకు జీతాలు పెంచాలని కోరారు. అంగన్వాడీలకు కనీస వేతనం, పింఛను సౌకర్యం కల్పించాలని తెలిపారు. యుఎం.నాగలక్ష్మి, ఎం.మున్ని, శైలజ, శకుంతల, మేరీ పాల్గొన్నారు.

అరికెర, తండాలో పోలీసు కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరులో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు సిఐ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఈనెల 12న విజయ దశమి సందర్భంగా జరిగే దేవరగట్టు బన్ని ఉత్సవాల నేపథ్యంలో సోమవారం జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో అరికెర, తండా గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి 25 బన్ని కర్రలు, 12 మోటార్ బైక్‌లను సీజ్ చేసినట్లు ఆలూరు సిఐ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి ఘర్షణలకు తావివ్వకుండా అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలిపారు. ఆలూరు, చిప్పగిరి, హోళగుంద, హాలహర్వి ఎస్‌ఐలు సి.వెంకట నరసింహులు, రమేష్ బాబు, బాల నరసింహులు, చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

'సిసి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి'


వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ప్రజాశక్తి - ఆలూరు

పట్టణంలోని స్కంద వెంచర్‌లో సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శి వై.ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కెపి.నారాయణస్వామి మాట్లాడారు. పట్టణంలో పదేళ్లుగా స్కంద వెంచర్ (దేవేంద్రప్ప ప్లాట్లు)లో, సిద్ధేశ్వర కాలనీ(సిపిఎం)లో సిసి రోడ్లు, డ్రెయినేజీ లేక ప్రజలు ఇబ్బందులు పతున్నారని తెలిపారు. అధికారులు, పాలకులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు. స్కంద వెంచర్‌లో తాగునీటి కోసం మూడు ఇంచుల పైపులైన్ వేయాలని తెలిపారు. వార్డు మెంబర్ జీర గౌడ్, కాలనీ వాసులు ఆనంద రావు, నాగరాజు, ధనుంజయ, రామాంజినేయులు, శాంతమ్మ, శారద, రాజేశ్వరి, నందిని, బండెమ్మ పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మిత్రుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని గాజులదిన్నె గ్రామానికి చెందిన కురువ ధనంజయ గత కొద్ది రోజుల క్రితం కర్నూలు నుంచి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ధనుంజయ కుటుంబానికి సహాయం చేయాలనే ఉద్దేశంతో గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న 2013 పదో తరగతి తోటి మిత్రులందరూ కలిసి రూ.20 వేలను సోమవారం ధనుంజయ కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో ఆ కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని, ధనుంజయ కుమారునికి ఉచితంగా విద్యను అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పాండు, మీనాక్షి, సురేష్ యాదవ్, ఖాసీంవలీ, శ్రీకాంత్, రవి, వీరేష్ పాల్గొన్నారు.

ఐటి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - ఆలూరు

వృత్తి విద్య కోర్సులో భాగంగా ఆలూరు ఆదర్శ పాఠశాల ఐటి విద్యార్థులకు సమగ్ర శిక్ష, లెర్నెట్ స్కిల్స్ వారి సహకారంతో ఉచితంగా ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రాఘవరావు, వృత్తి విద్య అధ్యాపకులు ఇ.ప్రకాష్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. ఆలూరులోని శ్రీసాయి కృష్ణ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో 10వ తరగతి, ద్వితీయ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇండస్ట్రీ, ఐటి కంపెనీల్లో భవిష్యత్తులో ప్రత్యక్ష అనుభవాలపై అవగాహన కల్పించి, వారికి పైథాన్ ప్రోగ్రాం, డిజిటల్ డాక్యుమెంటేషన్‌పై ప్రాక్టికల్ నాలెడ్జ్ బోధిస్తారని తెలిపారు. ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్‌ను 10 రోజుల పాటు నిర్వహించి, విద్యార్థులకు సర్టిఫికెట్ ఇస్తామని చెప్పారు. విద్యార్థుల బ్యాంకు అకౌంట్‌కు ఒక్కొక్కరికి రూ.1000 నగదు జమ అవుతాయని తెలిపారు.


మాట్లాడుతున్న సిబ్బంది

రాష్ట్రానికి ఆదర్శం...

- రూపాయి అవినీతి లేని పోలీసు స్టేషన్
- మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సిఐ సుదర్శన్‌రెడ్డి నేతృత్వంతో పోలీసు స్టేషన్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో పోలీసు స్టేషన్ అంటే ప్రయివేట్ పంచాయితీలకు అడ్డా అన్నది ప్రజలందరికీ తెలిసిన బహిరంగ రహస్యమని తెలిపారు. గతంలో కానిస్టేబుల్ నుంచి ఇన్‌స్పెక్టర్ వరకు ప్రయివేట్ పంచాయితీలు చేస్తూ పోలీసు స్టేషన్ జనంలో కిటకిటలాడేదని చెప్పారు.

కానిస్టేబుళ్లలో కొందరు, రాజకీయ నాయకులు కొందరు, కొందరు విలేకరులు, కానిస్టేబుళ్లు పంచాయితీలకు ఏజెంట్లుగా వ్యవహరించేవారని తెలిపారు. పోలీసు అవినీతితో ఒక కానిస్టేబుళ్ల మాఫియా రాజ్యమేలిందన్నారు. రౌడీ బ్యాచిలు పోలీసు స్టేషన్‌కు వెళ్లి దర్జాగా తిరిగి వచ్చేవారని తెలిపారు. ఈ వాతావరణంతో ఊళ్లోని ప్రజలు పోలీసులన్నా, రౌడీలన్నా భయపడాల్సి వచ్చేదన్నారు. వారితో వెళితేనే పనులు జరుగుతాయని వారిని ఆశ్రయించక తప్పేది కాదని తెలిపారు. ప్రస్తుతం సిఐ సుదర్శన్ రెడ్డి రాకతో ఈ పరిస్థితి మొత్తం మారిందని, రాష్ట్రానికి ఆదర్శంగా పోలీసు స్టేషన్‌గా ఉందంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెప్పారు. పోలీసు స్టేషన్‌కు బాధితులు ఎవరైనా వెళ్లి సమస్య చెప్పుకోవచ్చని, ఏ కానిస్టేబుల్ పెత్తనానికి అవకాశం ఇవ్వడం లేదని తెలిపారు. ప్రజలను వేధించడం లేదని, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడం లేదని చెప్పారు. గంజాయి ముఠాల అడ్రస్ లేదన్నారు. దొంగ కేసులు లేవని, ట్రాఫిక్ సమస్యలు లేవని తెలిపారు. రౌడీ బ్యాచిలకు కోటింగ్ తప్పడం లేదన్నారు. రాత్రి 10 గంటల పైన అనవసరంగా పట్టణంలో తిరగడానికి వీల్లేదని తెలిపారు. ఢాబాల్లో కూర్చొని మద్యం సేవించడానికి వీల్లేదని, కానిస్టేబుళ్లు వేసిన డ్యూటీలో కచ్చితంగా పనిచేయాల్సిందేనని చెప్పారు. రాజకీయ రెకమండేషన్లకు అవకాశమే లేదని, కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎక్కడా పోలీసు స్టేషన్‌లో రూపాయి అవినీతి లేదని తెలిపారు. భూ దందా మాఫియా పోలీసు స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారని చెప్పారు. ప్రజల్లో క్రమశిక్షణ వచ్చిందని, ఊరు ప్రశాంతంగా ఉందని తెలిపారు. ప్రజలు ధైర్యంగా జీవిస్తున్నారని, దీనికంతా సిఐ సుదర్శన్ రెడ్డి నిజాయితీనే కారణమని చెప్పారు. సిఐని ఒక లెజెండ్‌గా ప్రజలు పిలుచుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటువంటి అధికారి పరిపాలన తీరును రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని కోరారు.

పంచాయతీ వర్కర్లకు కనీస వేతనమివ్వాలి

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ

తెర్నేకల్ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష డిమాండ్ చేశారు. సోమవారం ఇఒఆర్‌డి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాముడుతో మాట్లాడారు. గత 5 రోజులుగా విధులు బహిష్కరించి వేతనాల పెంపు కోసం అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నా కార్మికుల కష్టాలు పట్టించుకోవడం లేదని తెలిపారు. నేటి అవసరాలతో, పెరిగిన ధరలతో నెలకు రూ.6 వేల వేతనంతో ఎలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ ఉందని, తెలిపారు. పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్లు ఇవ్వాలని, సబ్బులు, నూనెలు, చెప్పులు, బట్టలు ఇవ్వాలని కోరారు. పారిశుధ్య కార్మికులు శాంతి రాజు, పులి రాజు, భార్గవ్, పెద్దయ్య, రాముడు, మధు, మండిగిరి రాముడు పాల్గొన్నారు.

రైతు సేవలో ప్రభుత్వం

- మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - చిప్పగిరి

వితనాలను పంపిణీ చేస్తున్న మీనాక్షి నాయుడు

రైతులకనుగుణంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు తెలిపారు. సోమవారం ఏరూరు గ్రామంలో ప్రభుత్వం రాయితీ కింద అందించే శనగ విత్తనాలను అగ్రికల్చర్ అసిస్టెంట్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, సర్పంచి వెంకటలక్ష్మి చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం అందించే రాయితీ శనగలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులందరూ దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో పేరును నమోదు చేయించుకుని డబ్బులు చెల్లించాలని తెలిపారు. సేనాపతి, మిరపకాయల చంద్ర, మాజీ ఎంపిటిసి నరసింహులు, చంద్రశేఖర్, రంగస్వామి, రామచంద్ర పాల్గొన్నారు.

వికలాంగులకు మోటార్ ట్రై సైకిళ్లు ఇవ్వాలి

- టిడిపి 19వ వార్డు ఇన్‌ఛార్జీ శ్రీనివాస్ ఆచారి

ప్రజాశక్తి - ఆదోని

వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్ ఆచారి

కాళ్లు, చేతుల లోపం ఉన్న వారికి మోటార్ ట్రై సైకిళ్లు ఇప్పించాలని టిడిపి 19వ వార్డు ఇన్‌ఛార్జీ శ్రీనివాస్ ఆచారి కోరారు. సోమవారం ఆదోనిలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో కొంతమందికి ట్రై సైకిళ్లు ఇచ్చారని, రోడ్డుపై ఎత్తు ప్రాంతానికి వెళ్లే సమయంలో వాటిని నడపలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వికలాంగుల కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారందరికీ మోటార్‌తో ఏర్పాటు చేసిన ట్రై సైకిల్ పంపిణీ చేస్తే వారి రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని కోరారు. వికలాంగుల విన్నపాన్ని సంబంధిత కార్పొరేషన్‌కు సిఫార్సు చేస్తామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు.